క్లుప్తంగా

శివాలయంలో ప్రత్యేక పూజలు



వంగసార శివాలయంలో హోమం నిర్వహిస్తున్న భక్తులు

చింతపల్లిరూరల్: వైశాఖ పౌర్ణమి కావడంతో మండలంలో వంగసారలో శివాలయంలో గురువారం అన్నపూర్ణ విశాలాక్షి సహిత కాశీ విశ్వనాథునికి విశేష అభిషేకాలు, నవగ్రహిత సర్వదేవతా హోమం, సత్యనారాయణ హోమం గ్రామస్తులు నిర్వహించారు. ఆశ్రమంలో శివునికి ప్రత్యేక పూజలు చేశారు. స్థానికులతో పాటు పరిసర ప్రాంతాల నుంచి భక్తులు వచ్చారు. అనంతరం భక్తులకు సత్యనారాయణ వ్రత ప్రసాదం వితరణ జరిగింది. ఆలయ నిర్వాహకుడు కృష్ణారావు, గ్రామస్తులు మహేష్, లక్ష్మి, చిన్నమ్మి, కమలమ్మ తదితరులు పర్యవేక్షించారు.

నేడు మండల సమావేశం

వీఆర్ పురం: మండల సర్వసభ్య సమావేశాన్ని శుక్రవారం ఉదయం 10 గంటలకు స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో నిర్వహిస్తున్నట్టు ఎంపీడీవో ఆర్.ఫణీంద్రరెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపీపీ కారం లక్ష్మీ అధ్యక్షత నిర్వహించనున్న ఈ సమావేశానికి మండల స్థాయి అధికారులు, సిబ్బంది తగిన సమాచారంతో రావాలన్నారు. అలాగే ప్రజా ప్రతినిధులందరూ తప్పక హాజరు కావాలని ఆయన కోరారు.

చిన్నారుల ఆరోగ్యంపై శ్రద్ధ తప్పనిసరి



పిల్లలను పరీక్షిస్తున్న డాక్టర్ మల్లికార్జున్

కొయ్యూరు: మండలంలోని గదబపాలెం పంచాయతీ మల్లవరంలో గురువారం వైద్య శిబిరం నిర్వహించారు. అల్లూరి యువ గిరిజన సేవా సంఘం, హెల్పింగ్ హ్యాండ్స్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ వైద్య శిబిరంలో నర్సీపట్నం ఉమా నారాయణ ఆస్పత్రికి చెందిన చిన్న పిల్లల వైద్య నిపుణులు డాక్టర్ పి.మల్లికార్జున్ చిన్నారులకు వైద్య పరీక్షలు చేశారు. సుమారు 100 మందికి చిన్న పిల్లలకు ఆరోగ్యపరీక్షలు చేసి ఉచితంగా మందులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తల్లిదండ్రులు తమ పిల్లల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. మల్లేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

వేసవి తరగతులు ప్రారంభం



వేసవి తరగతులను పర్యవేక్షిస్తున్న గ్రంథాలయ అధికారి మానస

హుకుంపేట: మండల కేంద్రంలోని శాఖా గ్రంథాలయంలో గురువారం నుంచి వేసవి తరగతులు ప్రారంభించినట్టు శాఖ గ్రంథాలయ అధికారి మానస చెప్పారు. వేసవి తరగతులను ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతు ఈ నెల 23 నుంచి వచ్చే నెల 7వ తేదీ వరకు జరిగే ఈ వేసవి తరగతుల్లో చిన్నారులకు డ్రాయింగ్, స్టోరీ టెల్లింగ్, వ్యాసరచన, పలు ఆటల పోటీలు నిర్వహించి చివరి రోజున విజేతలకు బహుమతులు అందజేస్తామన్నారు.

కాలేజీలో ప్రవేశానికి దరఖాస్తులు

మారేడుమిల్లి: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు ప్రిన్సిపాల్ కె.కర్ణరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. కళాశాలలో ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, హెచ్ఈసీ గ్రూపులున్నట్టు చెప్పారు. మోడల్ క్లాస్ రూమ్స్, అనుభవజ్ఞులైన లెక్చరర్లు, సైన్స్ ప్రయోగశాల తదితర సదుపాయాలున్నట్టు పేర్కొన్నారు. ఆయా గ్రూపుల్లో ఖాళీలున్నాయని, పదో తరగతి పూర్తి చేసుకున్న విద్యార్థులు ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. మరిన్ని వివరాలకు నేరుగా కళాశాలలో సంప్రదించాలని కోరారు.

బస్సు వచ్చే.. కష్టాలు తీరే

- పెదగూడ, దొడిపుట్టు పంచాయతీలకు ఆర్టీసీ బస్సు సర్వీసులు
- గ్రామస్తుల హర్షం



పెదగూడ నుంచి ముంచంగిపుట్టుకు బయలుదేరుతున్న ఆర్టీసీ బస్సు

ముంచంగిపుట్టు: నాడు సరైన రహదారులు లేక ఆ ప్రాంత వాసులకు నిత్యం రవాణా కష్టాలు నిత్యం వేధిస్తూ ఉండేవి...అ గత టీడీపీ ప్రభుత్వ హయాంలో గిరిజన గ్రామాలకు రహదారుల నిర్మాణం జరగలేదు. చంద్రబాబు పాలనలో ఏ ప్రాంతాల్లోనూ కనీస మౌలిక సదుపాయాలు కల్పించలేదు. మట్టి రహదారులపైనే ..కాలినడకనే రాకపోకలు సాగించేవారు.. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఆ ప్రాంత గిరిజనుల కష్టాలు తీరాయి.ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి మన్య ప్రాంతాల అభివృద్ధికి కోట్లాది రూపాయల నిధులు మంజూరు చేశారు. అన్ని ప్రాంతాల్లో మౌలిక సదుపాయాలు కల్పించారు. ఇందులో భాగంగా ముంచంగిపుట్టు మండలం పెదగూడ,దొడిపుట్టు పంచాయతీ కేంద్రాలకు పక్క రహదారి సౌకర్యం కలగడంతో గిరిజనులకు ప్రయాణ కష్టాలు తీరాయి. సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి గిరిజనులు కృతజ్ఞతలు తెలియజేస్తున్నారు.

నాడు నిత్యం అవస్థలే

దొడిపుట్టు పంచాయతీలో అధికంగా కూరగాయల రైతులు ఉన్నారు. వీరంతా వారపు సంతలకు, మండల కేంద్రానికి వచ్చేందుకు నిత్యం అవస్థలు పడుతూ ఉండేవారు. పెదగూడ పంచాయతీలోని గ్రామాలతో పాటు దారెల, సుజనకోట పంచాయతీలను కలుపుకొని 28 గ్రామాలు పెదగూడ నుంచి కొత్తూరు జంక్షన్ వరకు 4 కిల్లో మీటర్ల ప్రయాణించాలి. గత 10 సంవత్సరాల కిందట ఆర్టీసీ బస్సును అధికారులు వేసి రహదారి బాగో లేదని కారణంతో అప్పట్లో సర్వీసును నిలుపుదల చేశారు. అప్పటి నుంచి ఆ ప్రాంత గిరిజనులు ప్రైవేట్ వాహనలే దిక్కుగా మారాయి. ప్రైవేట్ వాహన డ్రైవర్ల పరిమితికి మించిన ప్రయాణికులతో అధిక వేగంతో రాకపోకలు సాగిస్తుంటారు. దీంతో గ్రామస్తులకు గత్యంతరం లేక అరచేతిలో ప్రాణాలతో ఆయా వాహనాల్లోనే గ్రామస్తులు ప్రయాణాలు సాగిస్తుండేవారు.



దొడిపుట్టు పంచాయతీ కేంద్రానికి వేసిన తారురోడ్డు

రహదారులకు మహర్దశ.. అందుబాటులో ఆర్టీసీ బస్సు సర్వీసు

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చి వెంటనే పెదగూడ, దొడిపుట్టు పంచాయితీ కేంద్రాలకు అరకు, పాడేరు ఎమ్మెల్యేలు పాల్గుణ, భాగ్యలక్ష్మిలు, జెడ్పీ చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్రలు ప్రత్యేక చొరవతో అసంపూర్తిగా వదిలేసిన తారురోడ్లును పూర్తి చేసి పక్క రహదారులు కల్పించారు. దీంతో రహదారుల సమస్య తీరింది. కానీ రహదారి పూర్తి అయి నాలుగేళ్ల అవుతున్న ఆర్టీసీ బస్సు సర్వీసు మాత్రం లేదు.దీంతో పెదగూడ, దొడిపుట్టు పంచాయతీల గిరిజనులు, ఎమ్మెల్యేలు పాల్గుణ, భాగ్యలక్ష్మి, జెడ్పీ చైర్‌పర్సన్ సుభద్రలను, పాడేరు ఆర్టీసీ అధికారులను కలిసి రెండు పంచాయతీ కేంద్రాలకు బస్సు సౌకర్యాలు కల్పించేందుకు తెలియజేశారు. దీంతో అధికారులు స్పందించి బస్సు సర్వీసులను ప్రారంభించారు. దీంతో రెండు పంచాయతీల్లో 56 గ్రామాల గిరిజనులకు ప్రయాణ కష్టాలు తీరాయి. ప్రతి రోజూ ఉదయం, సాయంత్రం ముంచంగిపుట్టు నుంచి కొత్తూరు మీదగా పెదగూడకు బస్సు సర్వీసును నడుపుతున్నారు. పాడేరు నుంచి ముంచంగిపుట్టు మండల కేంద్రం మీదగా దొడిపుట్టు పంచాయతీ కేంద్రానికి రాత్రి నైట్ హాల్ట్ ఉండి ఉదయం బయలుదేరుతుంది. ఏళ్ల నాటి రవాణా కష్టాలు తీరడం, వ్యవసాయ ఉత్పత్తులను వారపు సంతలకు తీసుకువచ్చేందుకు సులువు కావడంతో పెదగూడ, దొడిపుట్టు పంచాయతీల గిరిజనులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. అరకు. పాడేరు ఎమ్మెల్యేలు చెట్టి పాల్గుణ, కొట్టగుల్లి భాగ్యలక్ష్మి, జెడ్పీ చైర్ పర్సన్‌లకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.

రవాణా కష్టాలు తీరాయి



మా పంచాయతీకి పక్క రహదారి నిర్మాణం జరిగింది. అయితే ఆర్టీసీ బస్సు లేక స్థానిక ప్రజలు నిత్యం అవస్థలు పడుతూ ప్రైవేట్ వాహనాలపై రాకపోకలు సాగించే వారు. బస్సు సౌకర్యం కల్పించాలని అరకు, పాడేరు ఎమ్మెల్యేలు పాల్గుణ, భాగలక్ష్మిలు, జెడ్పీ చైర్‌పర్సన్ సుభద్రలకు పంచాయతీ ప్రజలతో వెళ్లి కలిశాం. దీంతో వారు స్పందించి ఆర్టీసీ అధికారులతో మాట్లాడారు. పెదగూడకు బస్సు సౌకర్యం కల్పించారు. దీంతో రాకపోకలకు ఇబ్బందులు తొలగాయి. గ్రామస్తులందరూ వారికి ఎల్లవేళలా రుణపడి ఉంటాం.

– ఎం.బాబూరావు, సర్పంచ్, పెదగూడ పంచాయతీ, ముంచంగిపుట్టు మండలం

ఆనందంగా ఉంది



బస్సు సౌకర్యం కల్పించినందుకు చాలా ఆనందంగా ఉంది. వ్యవసాయ పనులు చేసే మాకు బస్సు సౌకర్యాలు ఉండటం కూరగాయలను వారపు సంతలకు తీసుకొని అమ్మకాలు చేసేందుకు చాలా ఉపయోగపడుతుంది. గతంలో ప్రైవేట్ వాహనాలతో ఇబ్బందులు పడ్డాం. ఏళ్ల నాటి కష్టాలు తీరడంతో గ్రామస్తులంతా ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

–కె.మోహనరావు, గ్రామస్తుడు, దొడిపుట్టు

వ్యక్తిగత పరిశుభ్రతపై అవగాహన అవసరం

హుకుంపేట: వ్యక్తిగత పరిశుభ్రతపై అవగాహన కలిగి ఉండాలని ఐసీడీఎస్ సీడీపీవో బాలచంద్రమణిదేవి చెప్పారు. మండలంలోని తీగవలస, ఆమురు, తడిగిరి గ్రామాల్లో గురువారం నిర్వహించిన బేటీ భచావో..బేటీ పడావో కార్యక్రమంలో భాగంగా కిశోర బాలికలు ఆరోగ్య పరిరక్షపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఐసీడీఎస్ సీడీపీవో బాలచంద్రమణిదేవి మాట్లాడుతూ వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రతను వివరించారు. సమాజంలో క్రమశిక్షణ, విద్యారంగాల్లో ప్రాధాన్యం తదితర అంశాలను తెలియజేశారు. బాలిక స్థాయి నుంచి క్రమశిక్షణతో మంచి నడవడిక అలవర్చుకోవాలన్నారు. అన్ని రంగాల్లో రాణిస్తే మహిళలకు బంగారు భవిష్యత్ ఉంటుందన్నారు. మంచి పౌష్టిక ఆహారం తీసుకుంటు ఆరోగ్య విషయంలో కూడా జాగ్రత్త పాటించాలని సూచించారు. సర్పంచ్ పాంగి బేసు, సూపర్‌వైజర్లు హసీనా, అప్పలనర్సమ్మ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సీడీపీవో బాలచంద్రమణి దేవి, చిత్రంలో సర్పంచ్ బేసు

గ్రామాల్లో వెల్లివిరిసిన ఆధ్యాత్మికత



కల్యాణాన్ని నిర్వహిస్తున్న వేద పండితులు



బంగారమ్మ తల్లిని దర్శించుకుంటున్న భక్తులు



అమ్మవారిని దర్శించేందుకు బారులు తీరిన భక్తులు

కొయ్యూరు: స్థానిక పురాతన శివాలయంలో వెలసిన సర్వమంగళాంబ సమేత త్రిపురాంతకస్వామి 108వ కల్యాణోత్సవం గురువారం రాత్రి అంగరంగ వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా ముందుగా ఉత్సవ విగ్రహాలను పల్లకిలో ఊరేగించారు. అనంతరం ఆలయం వద్ద ప్రత్యేకంగా పూలమాలలతో అలంకరించిన వేదికపై స్వామి, దేవేర్ల ఉత్సవ విగ్రహాలను అధిష్ఠింపజేశారు. విగ్రహాలను పూలమాలలు, నూతన వస్త్రాలు, ఆభరణాలతో అలంకరించారు. వేద పండితుల మంత్రోచ్ఛరణల నడుమ శాస్త్రోక్తంగా 108 మంది ఉభయదాతలతో సామూహిక కల్యాణోత్సవం జరిపించారు. సంప్రదాయం మేరకు గణేష్ పూజ, విష్వక్సేన పూజ, యజ్ఞోపవీత ధారణ, కన్యాదానం, జీలకర్ర బెల్లం పెట్టడం, మాంగల్యధారణ, తలంబ్రాలు, కర్పూర దండల అలంకరణ తదితర ఘట్టాలను నిర్వహించారు. అనంతరం తీర్థప్రసాద వితరణ చేశారు. ముందుగా ఆలయంలో ఉదయం నుంచి స్వామి వారి మూల విరాట్‌లకు పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామిని, అమ్మవారిని దర్శించారు. మధ్యాహ్నం భారీ అన్న సమారాధన జరిగింది. ఆలయ అర్చకులు వి.బాబ్జి, వి.కృష్ణల ఆధ్వర్యంలో శివ సన్నిధి గ్రూప్ సభ్యులు, దాతల సహకారంతో కార్యక్రమాన్ని అత్యంత వైభవంగా నిర్వహించారు.

వైభవంగా మొగలిపురం బంగారమ్మ పండగ

సబ్బవరం: మండలంలోని మొగలిపురంలో కొలువైన శ్రీబంగారమ్మ తల్లి పండగను భక్తులు గురువారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అధిక సంఖ్యలో భక్తులు బారులుతీరి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. మహిళలు పసుపు కుంకుమలు, చీరలు అమ్మవారికి సమర్పించారు. వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు గండి రవికుమార్, పార్టీ మండల యువజన విభాగం అధ్యక్షుడు యడ్ల నాయుడు, ఐడి బాబు తదితరులు అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు. అనంతరం సిరపరపువారి కల్లాల యూత్ పులిహోర, మజ్జిగ, ఐస్‌క్రీమ్ ముఖ్య అతిథుల చేతుల మీదుగా భక్తులకు పంపిణీ చేశారు. సాయంత్రం నిర్వహించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో సిరపరపు కుమార్, నవీన్, రామదాసు, వసంత్ కుమార్, ప్రశాంత్ నాయుడు, సురేష్, గండి చైతన్య పాల్గొన్నారు.

కనులపండువగా దుర్గాలమ్మ పండగ

రాంబిల్లి : మండలంలో వాడనర్సాపురం గ్రామంలో గురువారం దుర్గాలమ్మ అమ్మవారి పండగను ఘనంగా జరుపుకొన్నారు. వాడనర్సాపురం సహా పలు గ్రామాల భక్తులు అమ్మవారిని దర్శించుకొని పసుపు, కుంకుమలు సమర్పించుకొని మొక్కులు తీర్చుకున్నారు. అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు బారులు తీరారు. పలు ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించారు.

ఘనంగా మరిడిమాంబ పండగ

బుచ్చెయ్యపేట: ఐయితంపూడి గ్రామదేవత మరిడిమాంబ పండగను గ్రామస్తులు గురువారం ఘనంగా నిర్వహించారు. పార్టీలకు అతీతంగా గ్రామ శివారులో అమ్మవారి ఆలయం వద్దకు కుటుంబ సభ్యులతో కలిసి వెళ్లి భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. సాయంత్రం అమ్మవారిని ఊయలలో ఆడించారు. ఈ ఏడాదిలో నమ్ముగా వర్షాలు కురిసి పాడిపంటలు బాగా పండి, సిరి సంపదలతో, ఆయురారోగ్యాలతో తులతూగాలని అమ్మవారిని ప్రార్థించి మొక్కులు చెల్లించుకున్నారు. బుచ్చెయ్యపేట, కేపీ అగ్రహారం, పైడంపేట, కొండపాలెం తదితర గ్రామాల భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో గ్రామంలో ఎటువంటి సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించకుండా పోలీసులు గ్రామస్తులకు అవగాహన కల్పించారు.

వంట గ్యాస్ కొరత లేకుండా చర్యలు

- పెదబయలు భారత్ గ్యాస్ గోదామును పరిశీలించిన పాడేరు జీసీసీ డివిజనల్ మేనేజర్ సింహాచలం

సాక్షి ఎఫెక్ట్..

పెదబయలు: పెదబయలు వంట గ్యాస్ కొరత లేకుండా గొడౌన్‌లో పూర్తిస్థాయిలో గ్యాస్ నిల్వ ఉండేలా చర్యలు తీసుకుంటామని పాడేరు జీసీసీ డివిజనల్ మేనేజర్ సింహాచలం అన్నారు. ‘గ్యాస్ కొరతతో అవస్థలు’ శీర్షికను ‘సాక్షి’లో గురువారం ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. ఈ మేరకు పెదబయలులో జీసీసీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న భారత్ గ్యాస్ గొడౌన్‌ను జీసీసీ డీఎం తనిఖీ చేశారు. మూడు వారాలుగా గ్యాస్ నిల్వ లేకపోవడానికి గల కారణాలను తెలుసుకున్నారు. ముంచంగిపుట్టు మండలంలో కూడా జీసీసీ ద్వారా భారత్ గ్యాస్ వినియోగదారులకు సరఫరా చేస్తామన్నారు. అత్యవసరమైతే ముంచంగిపుట్టు గొడౌన్ నుంచి తీసుకొచ్చి అందజేస్తామన్నారు. పెదబయలు గోదాములో శుక్రవారం నుంచి పూర్తి స్థాయిలో గ్యాస్ అందుబాటులో ఉంటుందన్నారు. ముంచంగిపుట్టు గోదాము నుంచి కొన్ని గ్యాస్ సిలిండర్లు తెప్పించి వినియోగదారులు అందించారు. మండల వినియోగదారులు ఇతర వ్యాపారుల దగ్గర ఎక్కువ ధరకు గ్యాస్ కొనుగోలు చేయాల్సిన అవసరం లేదని ఇక నుంచి పూర్తి స్థాయిలో గ్యాస్ అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకుంటామన్నారు. అలాగే జీసీసీ కార్యాలయాన్ని సందర్శించారు. మండలంలో పౌర సరఫరాల సరకులు సక్రమంగా అందించాలని సూచించారు. స్థానిక జీసీసీ మేనేజర్ ఓలేసి గాసి, గ్యాస్ గొడౌన్ ఇన్‌చార్జి చంద్రశేఖర్, సీనియర్ అకౌంటెంట్ దీనాకుమారి తదితరులు పాల్గొన్నారు.



పెదబయలులోని గొడౌన్‌లో గ్యాస్ పంపిణీని పర్యవేక్షిస్తున్న జీసీసీ డీఎం సింహాచలం

సమన్వయం పాటించాలి



ఎటపాకలో మాట్లాడుతున్న సీఐ రామారావు



కొయ్యూరులో ట్లాడుతున్న సీఐ,ఎస్ఐ

ఎటపాక: సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్ సమయంలో అన్ని రాజకీయ పార్టీ నాయకులు సమన్వయం పాటించాలని ఎటపాక సీఐ రామారావు సూచించారు. జూన్ 4న జరుగనున్న కౌంటింగ్ నేపథ్యంలో అన్ని పార్టీల నాయకులతో గురువారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ రామారావు మాట్లాడుతూ ఎన్నికల ఫలితాల కారణంగా గ్రామాల్లో ఎటువంటి అవాంచనీయ ఘటనలు చోటు చేసుకోకుండా శాంతియుతంగా వ్యవహరించాలని చెప్పారు. ఎటువంటి ర్యాలీలు, సభలు నిర్వహించొద్దని, బాణాసంచా కాల్చటం నిషిద్ధమన్నారు. నిబంధనలు ఉల్లంఘించిన వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎస్ఐ కె.పార్థసారధి, ప్రజాప్రతినిధులు, నేతలు పాల్గొన్నారు.

కొయ్యూరు: మండలంలోని రేవళ్లు, రేవళ్ల కంటారం గ్రామాల్లో సీఐ పి.వెంకటరమణ,మంప ఎస్ఐ లోకేష్ కుమార్ గురువారం సందర్శించారు.ఈ సందర్భంగా వారు గ్రామస్తులతో మాట్లాడుతూ వచ్చే నెల 4వ తేదీన జరిగే ఓట్ల లెక్కింపు సందర్భంగా ఎవరు కూడా విజయోత్సవ ర్యాలీలను నిర్వహించొద్దన్నారు. ఎన్నికల కోడ్ ముగిసే వరకు 144 సెక్షన్ అమల్లో ఉందని, ఎక్కడ గుంపులుగా జనాలు ఉండకూడదని, సభలు, సమావేశాలకు అనుమతుల్లేవన్నారు. కౌంటింగ్ రోజును రాజకీయ పార్టీ నాయకులు సొంత గ్రామాల్లోనే ఉండాలని, పాడేరు వెళ్లేందుకు అనుమతుల్లేవన్నారు. నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవన్నారు.

రాజవొమ్మంగి: లూజు పెట్రోలు అమ్మకాలను నిషేధించామని, విక్రయించొద్దని రాజవొమ్మంగి సీఐ సన్యాసినాయుడు గురువారం పెట్రోలు బంక్ యజమానులను హెచ్చరించారు. ఈ మేరకు జిల్లా ఎస్పీ ఉత్తర్వులు జారీ చేశారని పేర్కొన్నారు. బాటిళ్లలో, టిన్నులలో పెట్రోలు నింపి దుకాణాల్లో చిల్లరగా అమ్మకాలు చేపడితే చర్యలు తీసుకొంటామన్నారు. ఆయన వెంట ఎస్ఐ వెంకయ్య, సిబ్బంది ఉన్నారు.

గ్రామాల్లో దోమలమందు పిచికారీ పనులు

రాజవొమ్మంగి: స్థానిక పీహెచ్‌సీ పరిధిలోని గ్రామాల్లో నిర్వహిస్తున్న దోమలనివారణ మందు పిచికారీ పనులను రంపచోడవరం డివిజినల్ అసిస్టెంట్ మలేరియా ఆఫీసర్, డిస్ట్రిక్ట్ కన్సల్టెంట్ శ్రీనివాసరాజు గురువారం పరిశీలించారు. స్ప్రేయింగ్ పనులు చేపడుతున్న సిబ్బందికి సూచనలు ఇచ్చారు. అనంతరం పీహెచ్‌సీలోని రికార్డులు పరిశీలించారు. గ్రామాల్లో విస్తృతంగా పిచికారీ పనులు జరుగుతున్నాయని, ప్రతి ఒక్కరూ ఇంటి బయట, లోపల దోమల మందు పిచికారీ చేయించుకోవాలని, పరిసరాల్లో నీరు నిల్వ లేకుండా చూసుకోవాలని, పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. మెడికల్ ఆఫీసర్ సుష్మ, మలేరియా సబ్ యూనిట్ ఆఫీసర్ చీడిపల్లి ప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు.



రాజవొమ్మంగి పీహెచ్‌సీలో రికార్డులు పరిశీలిస్తున్న ఏడీఓ శ్రీనివాసరాజు

శ్రీనివాసుని కల్యాణ వేడుకకు ముహూర్తపు రాట



వేంకటేశ్వర స్వామి కల్యాణానికి ముహూర్తపు రాట వేస్తున్న భక్తులు

సీలేరు: సీలేరులో గల స్థానిక వేంకటేశ్వరస్వామి ఆలయంలో శ్రీనివాసుని కల్యాణ మహోత్సవాల సందర్భంగా గురువారం మహూర్తపు రాట వేశారు. ఉదయం గణపతి పూజ , అనంతరం పందిరి రాట వేశారు. ఉత్సవాల్లో భాగంగా ఈనెల 24 న వాస్తు నవగ్రహ భద్రమండలి, 27 న స్వామి వారి తిరువీధి ఉత్సవం, 29 న పద్మావతి సమేత శ్రీ వేంకటేశ్వరుని కళ్యాణం మహోత్సవాలు జరుగుతాయని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో మహిళలు, భక్తులు పాల్గొన్నారు.

ఘనంగా అమ్మవారి పండగ

పరవాడ: బ్రాహ్మణి ముత్యాలమ్మ అమ్మవారి పండగను భక్తులు గురువారం భక్తి శ్రద్ధలతో జరుపుకున్నారు. పండగ నేపథ్యంలో ఆలయాన్ని పూలతో అలంకరించి విద్యుత్ తోరణాలతో ముస్తాబు చేశారు. వేకువ జాము నుంచి అమ్మవారికి పసుపు కుంకుమలు సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. భారీ అన్నసమారాధన జరిగింది.

ఆకట్టుకుంటున్న పుట్ట

అరకులోయ రూరల్: మండలంలోని పెదలబుడు పంచాయతీ గంజాయిగుడ గ్రామ సమీపంలో ఉన్న గిరి గ్రామదర్శినికి కూతవేటు దూరంలో అటవీ ప్రాంతంలో ఐదున్నర అడుగులపుట్ట దర్శనం ఇస్తోంది. గత కొద్ది రోజులుగా కురుస్తున్న వర్షాల కారణంగా ఈ పెద్ద పుట్టు అమాంతంగా పెరుగుతూ ఉంది. ఈ రహదారి మీదుగా ప్రయాణించే ప్రతి ఒక్కరికి ఈ పెద్ద పుట్టను ఆసక్తి చూస్తున్నారు.



.గంజాయిగుడ గ్రామ సమీపంలో ఉన్న పుట్ట

రోడ్డు విస్తరణలో అల్లూరి విగ్రహం తరలింపు

రాజవొమ్మంగి: స్థానిక అల్లూరి మూడు రోడ్ల కూడలి నుంచి అధికారులు మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు విగ్రహాన్ని గురువారం భారీ క్రేన్ సహాయంతో వేరే ప్రాంతానికి తరలించారు. ఎన్‌హెచ్516ఈ రహదారి విస్తరణ పనుల్లో భాగంగా అల్లూరి విగ్రహాన్ని అక్కడ నుంచి తరలించి తాత్కాలికంగా స్థానిక పెన్షనర్స్ హోం వద్ద ఏర్పాటు చేశారు.



అల్లూరి కూడలి నుంచి తరలిస్తున్న అల్లూరి విగ్రహం

66 బైక్‌లు స్వాధీనం

పాయకరావుపేట : పట్టణంలో గురువారం కార్డన్ అండ్ సెర్చ్ నిర్వహించి 66 మోటారు బైక్‌లను స్వాధీనం చేసుకున్నట్టు సీఐ పి.అప్పలరాజు తెలిపారు. నక్కపల్లి, నర్సీపట్నం టౌన్, నర్సీపట్నం రూరల్ సీఐలతో కలిసి 90 మంది పోలీసు సిబ్బంది పట్టణంలో గల అంబేడ్కర్, దుర్గాకాలనీల్లో కార్డన్ అండ్ సెర్చ్ నిర్వహించి 66 బైక్‌లను సంబంధిత రికార్డులు లేనివి స్వాధీనం చేసుకోవడం జరిగిందన్నారు. మోటారు బైక్‌ల యజమానులు సంబంధిత రికార్డులను తీసుకొచ్చిన యెడల, వాటిని పరిశీలించి యజమానులకు వాహనాలు అప్పగిస్తామన్నారు.



పోలీసులు స్వాధీనం చేసుకున్న బైక్‌లు